
సాక్షి పల్నాడు

శుక్రవారం, 8, ఆగస్టు, 2025



వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వినుకొండ: పట్టణంలోని శ్రీనివాస్‌నగర్‌లో ఉన్న వెంకటేశ్వర స్వామి దేవాలయం 39వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. హోమం నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 588.50 అడుగులకు చేరింది. ఇది 307.5790 టీఎంసీలకు సమానం.



దుర్గమ్మకు కానుకలు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు పోసాని బసవయ్య గురువారం 24.7 గ్రాముల బంగారు ముక్కుపుడక, బొట్టు, నత్తును సమర్పించారు.

మొక్కజొన్న వైపు మొగ్గు

ఆరుగాలం శ్రమించే రైతన్నలకు సంప్రదాయ పంటల సాగుతో నష్టాలు తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక విత్తనాల నుంచి పంట విక్రయం వరకు అన్నీ కష్టాలే. దీంతో వారు తక్కువ పెట్టుబడికితోడు డిమాండ్ వల్ల గిట్టుబాటు ధర లభిస్తున్న మొక్కజొన్న వైపు మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో దాదాపు పది వేల ఎకరాలలో ఈ పంట ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సాగయ్యే అవకాశం కనిపిస్తోంది.



మొక్కజొన్న పంట

- మిర్చి, పత్తి, పొగాకు పంటల్లో నష్టాలతో ప్రత్యామ్నాయం కోసం చూపు
- పల్నాడు జిల్లాలో పెరుగుతున్న మొక్కజొన్న పంట సాగు
- తక్కువ పెట్టుబడి, ఎక్కువ లాభాలతో రైతులకు భరోసా

సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లా రైతులు కొన్నేళ్లుగా సాగు చేస్తున్న సంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న వైపు మొగ్గు చూపుతున్నారు. రెండు మూడేళ్లుగా ఈ పంట సాగు విస్తీర్ణం పెరిగింది. ఇప్పటివరకు మిర్చి, పత్తి, పొగాకు వంటి పంటలకు పెట్టుబడి అధికం కావడంతోపాటు దిగుబడి తగ్గడం, మద్దతు ధర లేక నష్టాలపాలైన రైతులకు మొక్కజొన్నతో ఆశలు చిగురిస్తున్నాయి. ఖరీఫ్ సాగు మొదలై రెండు నెలలు పూర్తి అయినా జిల్లాలో సాగు విస్తీర్ణం కనీసం 20 శాతం కూడా దాటకపోవడానికి కూడా ఇదే కారణం. మొక్కజొన్న సాగు సెప్టెంబర్ నుంచి పూర్తిస్థాయిలో మొదలుకానుంది. దీంతో ఖరీఫ్ సాగు మందగించింది.

10 వేల ఎకరాలకుపైగా...

జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో మొక్కజొన్న సాధారణ లక్ష్యం సుమారు 1,940 ఎకరాలుగా అధికారులు నిర్ణయించారు. అయితే ఇది ఈ ఏడాది 10 వేల ఎకరాలకు పైగా దాటే అవకాశముందని రైతుల ద్వారా తెలుస్తోంది. అధికారులు ఊహించిన దానికన్నా ఈ ఖరీఫ్‌లో మొక్కజొన్న సాగు అధికంగా ఉండే అవకాశముంది. దీనికి కారణం కొంత కాలంగా మొక్కజొన్నకు మంచి డిమాండ్ ఉండటమే.

లాభసాటిగా విక్రయ ధరలు

పౌల్ట్రీ రంగంలో మొక్కజొన్న వినియోగం అధికంగా ఉండటంతో రైతుకు గిట్టుబాటు ధర లభిస్తోంది. క్వింటాలు మొక్కజొన్న రూ.2,100 నుంచి రూ.2,400 వరకు డిమాండ్‌ను బట్టి పలుకుతోంది. గతేడాది మద్దతు ధర రూ.2,225 ఉంది. ఈ ఏడాది కేంద్రప్రభుత్వం మరో రూ.175 బోనస్ ప్రకటించడంతో రూ.2,400 కి చేరింది. మొక్కజొన్న పంట సాగు సమయం కూడా 110 నుంచి 130 రోజులు ఉంటుంది. పెట్టుబడి కూడా తక్కువే. ఎకరం పొలంలో దుక్కులు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కలుపుతీత, కూలీలకు సుమారు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు ఖర్చు కానుంది. ఎకరానికి దిగుబడి 25 నుంచి 30 క్వింటాళ్ల వరకు ఉంటోంది. అనుకున్నట్లు జరిగితే ఎకరానికి రూ.50 వేల వరకు ఆదాయం వస్తోంది. ప్రతికూల పరిస్థితులు ఎదురైనా పెట్టుబడి తక్కువగా ఉండటంతో నష్టాలు పెద్దగా రావడం లేదు.

మొక్కజొన్న సాగే శరణ్యం



నాకు 8 ఎకరాల సాగు భూమి ఉంది. గత ఏడాది వరి సాగు చేశాను. కష్టం ఎక్కువ, ప్రతిఫలం తక్కువైంది. గిట్టుబాటు ధరలు తక్కువ ఉంటున్నాయి. దీంతో ఈ ఏడాది మొక్కజొన్న సాగు చేయాలని నిర్ణయించుకున్నా. పంట కాలం, పెట్టుబడి తక్కువ కావడం కలిసి వచ్చే అంశం. అవసరమైన విత్తనాల సేకరణలో ప్రస్తుతం ఉన్నాను.

– మర్రి దుర్గారావు, రైతు, శావల్యాపురం

నష్టాల భయం తక్కువ



ఇతర పంటలతో పోలిస్తే మొక్కజొన్న పంట సాగుకు పట్టే సమయం, పెట్టే పెట్టుబడి తక్కువ. మరోవైపు ఈ పంటకు డిమాండ్ ఉండటంతో ధర ఆశాజనకంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో రైతులకు నష్టాల భయం తక్కువగా ఉంటోంది. దీంతో ఈ ఏడాది గతంతో పోల్చితే మొక్కజొన్న సాగు అమాంతం పెరగనుంది.

– అన్నపరెడ్డి శ్రీనివాసరెడ్డి, రైతు, చాగంటివారిపాలెం

వరి సాగు తగ్గిస్తున్నాం



మా కుటుంబానికి పది ఎకరాలు సాగు భూమి ఉంది. ఖరీఫ్ సీజనుకు వరి పంట ఐదు ఎకరాలకు మాత్రమే పరిమితం చేయాలనుకుంటున్నాం. పెట్టుబడులు పెరగడంతోపాటు మద్దతు ధర లేకపోవడంతో వరి సాగు చేయలేకపోతున్నాం. మిగిలిన ఐదు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగుకు సిద్ధమయ్యాం.

– బొమ్మినేని వేణు, రైతు, వయ్యకల్లు

మద్యం మత్తులో రోడ్డెక్కితే జేబు గుల్లే!

- 4 నుంచి డ్రంక్ అండ్ డ్రైవ్ వారోత్సవాలు
- మత్తులో వాహనాలు నడిపితే భారీగా జరిమానా



డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న టూటౌన్ సీఐ హైమారావు

నరసరావుపేట టౌన్: పల్నాడు జిల్లాలో మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై పోలీస్ శాఖ కొరడా ఝుళిపిస్తోంది. మత్తులో పట్టుబడితే మందు బాబుల జేబులు గుల్ల అవుతున్నాయి. మత్తు వదిలేలా జరిమానాలు విధిస్తున్నారు. రోడ్డు భద్రతా చర్యల్లో భాగంగా హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్, పరిమితికి మించి ప్రయాణం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, వాహన పత్రాల తనిఖీలతోపాటు మద్యం తాగి వాహనాలు నడిపిన వారిని గుర్తించి భారీగా జరిమానాలు విధిస్తున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై స్పెషల్ డ్రైవ్‌తోపాటు ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఒకసారి కట్టినవారు మళ్లీ రోడ్లపై మద్యం తాగి రావటానికి బయపడేలా జరిమానాలు విధిస్తున్నారు. మోతాదు నిర్ధారణ చేశాక ఆ మొత్తం ఆధారంగా ఫైన్ వేస్తున్నారు. రోజుకి సగటున 120–140 మందికి భారీ స్థాయిలో జరిమానాలు పడుతున్నాయి.

475 కేసులు నమోదు

పల్నాడు జిల్లాలో గడిచిన నాలుగు రోజుల వ్యవధిలో సుమారు 475 కేసులు నమోదు అయ్యాయి. జిల్లా కేంద్రమైన నరసరావుపేటతోపాటు చిలకలూరిపేట, వినుకొండ, మాచర్ల, పిడుగురాళ్ల, సత్తెనపల్లి పట్టణాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. అధిక మోతాదులో మద్యం తాగి వాహనాలు నడిపేవారిని న్యాయస్థానంలో హాజరు పరచనున్నారు. ఒక్కొక్కరికి సుమారు రూ.10 వేల వరకు , 100 ఎంఎల్ కంటే ఎక్కువ మద్యం సేవించిన వారికి రూ.15వేల జరిమానా విధిస్తున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పదే పదే పట్టుబడితే డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేస్తారు.

వారి కదలికలపై నిఘా

డ్రంక్ అండ్ డ్రైవ్‌తో పాటు అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. సమస్యాత్మక ప్రదేశాల్లో వారి కదలికలపై దృష్టి సారించారు. రౌడీలు, నేర చరిత్ర ఉన్నవారి ఫొటోలు, వేలిముద్రలు తదితర వివరాలు సేకరిస్తున్నారు. అలాంటి వారు బహిరంగ ప్రదేశంలో మద్యం తాగి వాహనాలపై తిరుగుతున్నట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ పోలీసులు రాత్రి వేళల్లో కూడా తనిఖీలు ముమ్మరం చేశారు. సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా కదలికలపై పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

ప్రమాదాల నివారణే ధ్యేయం

రోడ్డు ప్రమాదాలను నివారించేందుకే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు చెప్పుకొస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా తనిఖీలు ముమ్మరం చేశారు. పట్టణంలో ప్రతి రోజు ప్రధాన, అంతర్గత మార్గాల్లో టార్గెట్‌లతో తనిఖీలు చేస్తున్నారు. వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని... మద్యం తాగి వాహనం నడిపితే కఠినంగా వ్యవహరిస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

న్యూస్‌రీల్

ఘనంగా భూ వరాహ స్వామి జయంతి వేడుకలు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై భూ వరాహస్వామి జయంతి వేడుకలు రెండో రోజైన గురువారం వైభవంగా నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళా శాసనాలతో భూ వరాహస్వామి జయంతి మహోత్సవాల్లో భాగంగా ఉదయం 10 గంటలకు కల్యాణ మహోత్సవం నిర్వహించామని తెలిపారు. వివాహ యోగ్యత, దాంపత్యాభివృద్ధి, మంచి సంతానం పొందుటకు ఈ కల్యాణ మహోత్సవం దోహదపడుతుందని తెలిపారు. కల్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని తెలిపారు.

పీజీ కోర్సుల ఫలితాలు విడుదల

పెదకాకాని: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో ఏప్రిల్ జరిగిన పలు పీజీ కోర్సుల 4వ సెమిస్టర్ ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాదరావు గురువారం విడుదల చేశారు. సోషల్ వర్క్ 16కి 16మంది, ఎంఏ అప్లయిడ్ లింగ్విస్టిక్స్ ట్రాన్స్‌లేషన్ స్టడీస్‌లో 10కి 10మంది, మాస్టర్ ఆఫ్ ఒకేషనల్ ఫుడ్ ప్రాసెసింగ్ అండ్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కోర్సులో 21కి 18 మంది, మాస్టర్ ఆఫ్ ఒకేషనల్ హార్టికల్చర్ అండ్ ల్యాండ్ స్కేపింగ్‌లో 16 మందికి 11మంది ఉత్తీర్ణత సాధించారు. రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను 18లోగా ఒక్కొక్క పేపరుకు రూ.1860, పర్సనల్ వెరిఫికేషన్‌కు రూ.2190 చెల్లించాలని ఆయన సూచించారు.

9,10 తేదీల్లో రాష్ట్ర స్థాయి జూడో పోటీలు



గుంటూరు వెస్ట్(క్రీడలు): గుంటూరు జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9, 10 తేదీల్లో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల బాలికల జూడో చాంపియన్‌షిప్ 2025–26 పోటీలు నిర్వహిస్తామని అసోసియేషన్ అధ్యక్షులు అప్పికట్ల శ్రీహరినాయుడు తెలిపారు. గురువారం స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులో పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను తాడికొండ శాసన సభ్యులు తెనాలి శ్రావణ్‌కుమార్, శ్రీహరి నాయుడు, గుంటూరు జిల్లా జూడో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్‌రెడ్డి, పల్నాడు జూడో అసోసియేషన్ అధ్యక్షులు పసుపులేటి వెంకటేశ్వరరావులు ఆవిష్కరించారు. శ్రీహరి నాయుడు మాట్లాడుతూ పెదపరిమిలోని మువ్వా చిన్న బాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ప్రాంగణంలో నిర్వహిస్తామన్నారు.

సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

నరసరావుపేటటౌన్: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 13వ తేదీ జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్.సత్యశ్రీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులతోపాటు సివిల్ కేసులు పరిష్కరించబడతాయన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని కోరారు.

వెలుగులోకి రేషను డీలర్ మోసం

తాడికొండ: గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన 'అధికారమే అండగా డీలర్ల దందా' కథనంతో అధికారులు తర్జనభర్జన పడ్డారు. ఎట్టకేలకు నింద తమపై వేసుకోకుండా హడావుడిగా ఆర్డీవో జారీ చేసిన సిఫార్సు లేఖను వెలుగులోకి తీసుకొచ్చి చేతులు దులుపుకొనే ప్రయత్నం చేశారు. ఒకే డీలరుకు రెండో పాయింట్ కేటాయించేందుకు చెప్పిన కారణాలు చూసి సాటి డీలర్లే ముక్కున వేలేసుకుంటున్నారు. అర కిలోమీటరు లేని దూరానికి ఒకటిన్నర కిలోమీటరుగా చూపిస్తూ రెండో పాయింట్ ఏర్పాటుకు అనుమతులిచ్చారు. కాలనీకి కేవలం 200 మీటర్లలోపు దూరంలో ఉన్న డీలరును పాడుబడిన భవనంలోకి వెళితేనే సరుకు కేటాయిస్తామంటూ దబాయించి తరిమేయడం మరో అంశం. ఆ పాయింట్ ఏ ఇంటివద్ద నిర్వహించాలి అనే డోర్ నంబర్ లేదా ఇతర అడ్రస్సు ఏమీ పొందుపరచకపోవడం చూస్తుంటే సదరు డీలరుపై ఎంత ప్రేమో అర్థం అవుతోంది.

రెడ్‌బుక్ పాలనకు హైకోర్టు తీర్పు చెంపపెట్టు

బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ విభాగం రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు పోలూరి వెంకటరెడ్డి



పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): అక్రమ కేసుల విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు కూటమి రెడ్‌బుక్ పాలనకు అడుగులకు మడుగులు ఒత్తుతున్న పోలీసులకు ఒక చెంపపెట్టు లాంటిదని బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ విభాగం రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు పోలూరి వెంకటరెడ్డి పేర్కొన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని ఆయన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో వెంకటరెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడిపిస్తున్నారు.. అనే దానికి తురకా కిషోర్ ఉదంతం ఒక ఉదాహరణ అని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేలా, పౌరహక్కులు నిలబెట్టేలా కిషోర్‌ను విడుదల చేయాలని హైకోర్టు తీర్పు ఇవ్వటం గొప్ప పరిణామం అన్నారు. పోలీసు వ్యవస్థ పొలిటికల్ బాస్‌ల చేతిలో కీలుబొమ్మల్లా మారిపోయిందని ధ్వజమెత్తారు. వాస్తవానికి తురకా కిషోర్‌ను 2022లో జరిగిన సంఘటనకు సంబంధించి అరెస్ట్ చేశాక, అనేక అక్రమ కేసులు బనాయించారన్నారు. కేవలం వైఎస్సార్‌సీపీకి చెందిన వ్యక్తి అనే దురుద్దేశంతో 210 రోజులకుపైగా జైల్లో పెట్టారని మండిపడ్డారు. కిషోర్‌ను మానసికంగా, శారీరకంగా వేధించారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో హైకోర్టు ప్రజాస్వామ్యాన్ని, ప్రజల హక్కులను కాపాడాలనే ఉద్దేశంతో చరిత్రాత్మక తీర్పు ఇచ్చిందని అన్నారు. సామాన్యుల హక్కులను కాలరాసే విధంగా అరాచక పాలన చేస్తున్న కూటమికి హైకోర్టు తీర్పు చెంప చెళ్లుమనిపించేలా ఉందన్నారు. అక్రమ అరెస్టులపై వైఎస్సార్‌సీపీ లీగల్ విభాగం బాధితుల పక్షాన అన్ని విధాలుగా పోరాడుతోందని, బాధితులకు న్యాయం జరిగే వరకు వారికి అండగా ఉంటామన్నారు. జ్యుడీషియల్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి న్యాయమూర్తులు రిమాండ్ విధించేటప్పుడు రికార్డులు సరిగ్గా పరిశీలించటం లేదనే విషయాన్ని హైకోర్టు ఎత్తి చూపటం జరిగిందన్నారు.

సుప్రీంకోర్టు, హైకోర్టు గైడ్‌లైన్స్ పాటించాలి..

ఇప్పటికైనా ఆయా న్యాయమూర్తులు కేసు పూర్వాపరాలను పరిశీలించి తగు నిర్ణయం తీసుకోవాలని, యాంత్రికంగా వ్యవహరించటం సరికాదన్నారు. సుప్రీం, హైకోర్టు గైడ్‌లైన్స్ పాటించాల్సిన బాధ్యత మెజిస్ట్రేట్‌లపై ఉందన్న విషయాన్ని తెలియజేస్తామన్నారు. ఏదో పోలీసులు తెచ్చారు.. రిమాండ్ విధిద్దాం.. అనే ధోరణిలో కాకుండా వాస్తవాలను పరిశీలించాలని విన్నవించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పూర్తిస్థాయిలో అండగా లీగల్ విభాగం ఉంటుందని, వారిని అన్ని విధాలుగా సహాయం అందజేస్తామన్నారు. తురకా కిషోర్‌పై ఇప్పటివరకు 18 అక్రమ కేసులు పెట్టారన్నారు. ఎల్లకాలం కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉండదన్న విషయాన్ని అధికారులు గుర్తించాలన్నారు. లేని పక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

తెనాలిలో విజిలెన్స్ అధికారుల దాడులు

- అనుమతి లేని వరి విత్తనాలు గుర్తింపు
- రూ.5,85,300 విలువైన విత్తనాలు సీజ్ చేసిన అధికారులు



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

తెనాలిటౌన్: అనుమతిలేని విత్తనాలను తెలంగాణ రాష్ట్రం నుంచి తెచ్చి తెనాలి ప్రాంతంలో అమ్మకాలు జరుపుతున్న ఎరువులు, విత్తనాల షాపులపై గురువారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మెరుపుదాడి చేసి భారీగా వరి విత్తనాలను సీజ్ చేశారు. స్థానిక నందులపేటలోని వినాయక ఎంటర్ ప్రైజెస్ దుకాణంలో జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయాధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అనుమతిలేని వరి విత్తనాలను తెలంగాణ నుంచి తెచ్చి అమ్ముతున్నట్లు గుర్తించారు. విత్తనాల నాణ్యతను పరీక్ష నిమిత్తం శాంపిల్స్ సేకరించి, ల్యాబ్ టెస్టింగ్‌కు పంపిచారు. డెల్టా ప్రాంతంలో ఎక్కువగా సాగు చేస్తున్న వరిలో మేలురకం విత్తనాలను రైతులకు అందివ్వాలన్న దృక్పథంతో వరుసగా తెనాలి పరిసర ప్రాంతంలో ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. రూ.5,85,300 విలువైన విత్తనాలు సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. దాడుల్లో విజిలెన్స్ అధికారి సీహెచ్.ఆదినారాయణ, ఇన్‌స్పెక్టర్లు కె.చంద్రశేఖర్, పి.శివాజీ, మండల వ్యవసాయాధికారి కె.సుధీర్ బాబు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలపై పథకం ప్రకారమే టీడీపీ దాడులు

- వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ విభాగం నేతలు
- ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌పై దాడికి ఖండన
- బీసీలను అణగదొక్కే దురుద్దేశంతోనే కూటమి ప్రభుత్వం కుట్రలని మండిపాటు



మీడియా సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ విభాగ నాయకులు

నరసరావుపేట రూరల్: రాష్ట్రంలో బీసీలపై టీడీపీ శ్రేణులు పథకం ప్రకారమే దాడులు చేస్తున్నాయని వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ విభాగ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ విభాగ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై జరిగిన దాడిని వారు తీవ్రంగా ఖండించారు. కూటమి నాయకులు తీరు మార్చుకోకపోతే బీసీల తిరుగుబాటును చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం పార్టీ బీసీ విభాగం ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. బీసీలను రాజకీయంగా లొంగదీసుకోవాలి, లేదంటే అణచివేయాలనే కుట్రతో దాడులు చేస్తున్నారని నేతలు ఆరోపించారు. బీసీ మహిళలను సైతం వేధిస్తున్నారని, కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై దాడి ఇందుకు నిదర్శనమని తెలిపారు. మాజీ మంత్రి విడదల రజినిపై సైతం టీడీపీ నాయకులు ట్రోలింగ్ చేసి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నించారని విమర్శించారు. మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్ తురకా కిషోర్‌పై అక్రమ కేసులు పెట్టి ఎనిమిది నెలలుగా వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడికి పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల్లో భయానక వాతావరణం కల్పించి బూత్‌ల ఆక్రమణకు పాల్పడేందుకు టీడీపీ నాయకులు చేస్తున్న ప్రయత్నాలే కారణమని తెలిపారు. వారిని హత్య చేసేందుకు దాడిలో పలువురు మారణాయుధాలతో పాల్గొన్నారని చెప్పారు. ఇదే పరిస్థితి కొనసాగితే రాబోవు ఎన్నికల్లో బీసీల ప్రతాపాన్ని చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగం బదులు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలపై దాడులు తీవ్రంగా జరుగుతున్నాయని తెలిపారు. టీడీపీ బీసీలకు చేసేందేమిలేదన్నారు. అధికారం శాశ్వతం కాదని గుర్తుచేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్‌లో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో బీసీ విభాగ జిల్లా అధ్యక్షుడు సిద్దారపు గాంధీ, వైఎస్సార్‌సీపీ మేధావుల విభాగం రాష్ట్ర కార్యదర్శి ఈఎం స్వామి, ఇంగ్లిష్ మీడియం విద్యా పరిరక్షణ వేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ దాదినబోయిన ఏడుకొండలు, బీసీ విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజవరపు శివనాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నరసరావుపేట వర్కింగ్ ప్రెసిడెంట్ అచ్చి శివకోటి, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు ఆలా లక్ష్మీనారాయణ, బీసీ విభాగం నరసరావుపేట నియోజకవర్గ అధ్యక్షుడు మర్రిపూడి రాంబాబు, పిడుగురాళ్ల మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు శెట్టిపల్లి పూర్ణ, బీసీ సంఘ నాయకులు బాలు, చల్లా కాశీబాబు, అబ్దుల్ కలాం ఆశయ సాధన కమిటీ అధ్యక్షుడు కాపర్తి మహమ్మద్‌నూర్‌లు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్‌ను దత్తత తీసుకున్న కలెక్టర్



నరసరావుపేట రూరల్: శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌ను జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు దత్తత తీసుకున్నారు. కలెక్టరేట్ సమీపంలోని లింగంగుంట్ల శంకరభారతీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం కలెక్టర్ అరుణ్‌బాబు సందర్శించారు. తరగతి గదుల్లోకి వెళ్లి ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులు అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తానని, ప్రతి నెలా చదువులో వెనకబడిన విద్యార్థుల ప్రమాణాలను పరిశీలిస్తానని తెలిపారు. సిలబస్ పూర్తి చేయడం మీద కంటే విద్యార్థులకు పాఠాలు అర్థమయ్యేలా బోధించడం ముఖ్యమని తెలిపారు. వారంలో రెండు సార్లు డిప్యూటి డీఈవో పాఠశాలను సందర్శించి బోధనా పద్ధతులను సమీక్ష చేయాలని ఆదేశించారు.

9 నుంచి గుంటూరులో ట్రాఫిక్ మళ్లింపులు

శంకర్‌విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి కూల్చివేత దృష్ట్యా నిర్ణయం



జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: గుంటూరు నగరంలోని శంకర్‌విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి కూల్చివేత పనుల దృష్ట్యా ఈ నెల 9వ తేదీ నుంచి ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగర పరిధిలో రాకపోకలు సాగించేందుకు ముందస్తు ప్రయాణ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని అన్నారు. ప్రజల సౌకర్యార్థం పలు తాత్కాలిక మార్గాలను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. అందరూ నిబంధనలను పాటించి సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు.

వివిధ మార్గాల్లో మళ్లింపులు ఇలా..

- అమరావతి రోడ్ నుంచి మున్సిపల్ ట్రావెలర్స్ బంగ్లా (ఎంటీబీ) సెంటర్ వైపు వెళ్లే భారీ వాహనాలను చిల్లీస్ పాయింట్ నుంచి ఇన్నర్ రింగ్ రోడ్ మార్గంలో మళ్లిస్తారు.
- లాడ్జి సెంటర్ నుంచి ఎంటీబీ సెంటర్ వైపు వెళ్లే కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఇకనుంచి అరండల్‌పేట, పొట్టిశ్రీరాములునగర్, డొంకరోడ్డు, మూడు వంతెనలు లేదా బ్రాడీపేట, కంకరగుంట రైల్వే ఓవర్ బ్రిడ్జి మార్గాల్లో వెళ్లాల్సి ఉంటుంది. తిరుగు ప్రయాణంలో కూడా ఈ మార్గం మీదుగా వెళ్లాలి.
- ఎంటీబీ సెంటర్ నుంచి లాడ్జి సెంటర్ వైపు వెళ్లే భారీ వాహనాలు (పాఠశాల, కళాశాల బస్‌లు సహా) రమేష్ హాస్పిటల్ నుంచి కంకరగుంట రైల్వే ఓవర్ బ్రిడ్జి మీదగా ప్రయాణించాలి.
- కోబాల్ట్‌పేట, కృష్ణానగర్, చంద్రమౌళినగర్, బృందావన్‌గార్డెన్స్, లక్ష్మీపురం ప్రాంతాల నుంచి మార్కెట్ వైపు వచ్చే వాహనాలన్నీ పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ రోడ్ లేదా బ్రాడీపేట, కంకరగుంట రైల్వే అండర్ బ్రిడ్జి, కలెక్టర్ కార్యాలయం రోడ్డు, నగరంపాలెం మీదగా వెళ్లాల్సి ఉంటుంది.
- పట్టాభిపురం నుంచి గుంటూరు ప్రభుత్వాసుపత్రి (జీజీహెచ్) వైపు వెళ్లే వారు కంకరగుంట రైల్వే ఓవర్‌బ్రిడ్జి, ఎంటీబీ సెంటర్, ప్రభుత్వ మహిళా కళాశాల (ఉమెన్స్ కాలేజ్) వైపు నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు మీదగా వెళ్లాలి.
- లాడ్జి సెంటర్ నుంచి ఎంటీబీ సెంటర్ వైపు వెళ్లే భారీ వాహనాలు చిల్లీస్, ఇన్నర్‌రింగ్ రోడ్, ఆటోనగర్, బస్టాండ్ లేదా కంకరగుంట రైల్వే ఓవర్ బ్రిడ్జి మార్గాలను ఉపయోగించాలని తెలిపారు.

క్లుప్తంగా

'వారసత్వ చేనేత' జాతీయ అవార్డు అందుకున్న మురళి



సత్తెనపల్లి: చేనేత ఇక్కత్ డిజైన్ కళ భవిష్యత్తు తరాలకు అందించాలని చేస్తున్న కృషికి పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన కర్నాటి మురళికి జాతీయ ఉత్తమ నేత వృత్తిదారుడి అవార్డు వరించింది. దేశవ్యాప్తంగా 19 మందికి అవార్డులు ప్రకటించగా.. రాష్ట్రం నుంచి మురళికి అరుదైన అవకాశం లభించింది. దేశ రాజధాని వేదికగా ఢిల్లీలోని భారత్ మండపంలో గురువారం జరిగిన జాతీయ చేనేత దినోత్సవంలో కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్, మంత్రి పబిత్రా మార్గరిటా చేతుల మీదుగా జాతీయ ఉత్తమ నేత వృత్తిదారుడి అవార్డును మురళి అందుకున్నారు. తండ్రి సాంబయ్య నుంచి చేనేత కళా నైపుణ్యాన్ని నేర్చుకున్న మురళి నాలుగున్నర దశాబ్దాలుగా చేనేత డిజైన్లపై పనిచేస్తున్నాడు. కేవలం ఆరో తరగతి వరకే చదువుకున్న ఆయన వారసత్వ చేనేత ప్రతిభ ఆధారంగా అమరావతిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడీ)లో ఇక్కత్ డిజైన్లపై శిక్షణ ఇస్తున్నాడు.

కోర్టు తీర్పుపై ఉపాధ్యాయ నేతల హర్షం



తాడేపల్లిరూరల్ : స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో 2019లో ఉపాధ్యాయులపై అప్పటి టీడీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులపై నమోదైన కేసు తీర్పు గురువారం ఉపాధ్యాయులకు అనుకూలంగా రావడంతో హర్షం వ్యక్తం చేశారు. జనవరి 31, 2019 సంవత్సరంలో ఏపీసీపీఎస్ఇఏ ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ పిలుపు ఇచ్చారు. అప్పట్లో తాడేపల్లి పోలీసులు 17 మంది ఉపాధ్యాయులపై కేసు నమోదు చేశారు. ఆ కేసులో కర్నూలుకు చెందిన ఏడుగురు, విజయనగరానికి చెందిన ఆరుగురు, అనంతపురానికి చెందిన ముగ్గురుపై కేసు నమోదైంది. మంగళగిరి న్యాయస్థానం ఉపాధ్యాయులపై అప్పటి ప్రభుత్వం మోపిన కేసు కొట్టివేయడంతోఅధ్యక్ష కార్యదర్శులు బాజీ పఠాన్, కరీమ్ రాజేశ్వరరావు కోర్టు తీర్పుపట్ల హర్షం వ్యక్తం చేస్తూ న్యాయం గెలిచిందని అన్నారు. తమ న్యాయమైన కోర్కెల కోసం శాంతియుతంగా ఛలో అసెంబ్లీ కార్యక్రమం చేపడితే తాడేపల్లి పోలీసులు అక్రమంగా కేసులు నమోదు చేశారు. అప్పటి నుండి 17 మంది కోర్టు చుట్టూ తిరుగుతున్నారన్నారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో సీబీ వెంకట రమణారెడ్డి (కర్నూలు), ప్రేమనాథ రెడ్డి (అనంతపురం), జె. రమేష్ (కర్నూలు) కులాయప్ప (అనంతపురం), అజయ్ (విజయనగరం) తవిడి నాయుడు (విజయనగరం), సత్యనారాయణ (గుంటూరు) ఉన్నారు.

రాష్ట్రంలో చేనేత కార్మికుల స్థితి దుర్భరం

- సత్తెనపల్లిలో అక్టోబర్ 6,7 తేదీలలో ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు
- సంఘం రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ



సభలో మాట్లాడుతున్న ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ

సత్తెనపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న చేనేత వ్యతిరేక విధానాలతో రాష్ట్రంలో చేనేత కార్మికుల స్థితిగతులు మరింత దుర్భరంగా మారాయని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ అన్నారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం జరిగిన సభకు చేనేత కార్మిక సంఘ నాయకుడు అనుముల వీరబ్రహ్మం అధ్యక్షత వహించారు. బాలకృష్ణ మాట్లాడుతూరాష్ట్రంలో పవర్ లూమ్స్ అధికంగా రావడం వల్లన చేనేత కార్మికులకు చాలీచాలని వేతనాలు వస్తూ తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. .ధర్మవరంలో పవర్‌లూమ్ కంటే అధునాతన మైన యంత్రాలు రావడంతో చేనేత కార్మికులు పనులు కోల్పోయి కుటుంబాలు గడవక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి, చేనేత రంగ పరిరక్షణకు ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన విధంగా ప్రతి చేనేత కార్మికునికి నేతన్న నేస్తం అమలు చేయాలన్నారు. ప్రతి చేనేత కార్మికుని కుటుంబానికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు అమలు చేయాలన్నారు. చేనేత రంగ పరిరక్షణకు11 రకాల రిజర్వేషన్లు అమలు జరపాలన్నారు. చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం ఇవ్వాల్సిన యారన్ సబ్సిడీ, పావలా వడ్డీ రిబేటు క్రింద రూ. 156 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సహకార సంఘాలు దివాలా తీయకుండా ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

సత్తెనపల్లిలో 11వ రాష్ట్ర మహాసభలు

ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం 11వ రాష్ట్ర మహాసభలు సత్తెనపల్లిలో అక్టోబర్ 6,7 తేదీలలో జరగనున్నాయని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కట్టా శివ దుర్గారావు, పిల్లలమర్రి బాలకృష్ణ తెలిపారు. ఈమేరకు 51 మందితో ఆహ్వాన సంఘం ఏర్పాటు చేయడం జరిగింది. ఆహ్వాన సంఘం అధ్యక్ష కార్యదర్శులుగా కట్టా శివ దుర్గారావు, పిల్లలమర్రి బాలకృష్ణలను ఎన్నుకున్నారు. మహాసభలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న చేనేత వ్యతిరేక విధానాలపై సుదీర్ఘంగా చర్చించడం జరుగుతుందన్నారు. ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ అనంత వెంకట్రావు, గౌరవ సలహాదారులు మున్నూరు భాస్కరయ్య, ఉపాధ్యక్షులు గద్దె చలమయ్య, కామర్తి రాజు, సహాయ కార్యదర్శులు డోకుపర్తి రామారావు, వాస గంగాధరరావు తదితరులు మహాసభ నిర్వహణ, ఏర్పాట్లపై అనేక సూచనలు, సలహాలు చేశారు.

జిల్లాలో సమృద్ధిగా ఎరువుల నిల్వలు

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జగ్గారావు



సత్తెనపల్లిలో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న డీఏఓ ఎం.జగ్గారావు, పక్కన ఏడీఏ రవిబాబు

సత్తెనపల్లి: జిల్లాలో సమృద్ధిగా ఎరువుల నిల్వలు ఉన్నాయని రైతులెవ్వరూ ఆందోళన చెందాల్సిన పని లేదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.జగ్గారావు చెప్పారు. సత్తెనపల్లి సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు డీఏఓ మాట్లాడుతూ జిల్లాలో ఆగస్టు నాటికి యూరియా 18,596 టన్నులు అవసరం కాగా 33 వేల టన్నులు వచ్చిందన్నారు. దీనిలో ఇప్పటివరకు 11 వేల టన్నులు విక్రయించగా ఇంకా 22 వేల టన్నుల నిల్వలు ఉన్నాయన్నారు. డీఏపీ ఆగస్టు నాటికి 10,700 టన్నులు అవసరం కాగా 13 వేల టన్నుల డీఏపీ జిల్లాకు వచ్చిందన్నారు. దీనిలో ఇప్పటి వరకు 4 వేల టన్నులు విక్రయంచగా ఇంకా 9 వేల టన్నుల డీఏపీ నిల్వలు ఉన్నాయన్నారు. పట్టణంలోని ఎరువుల దుకాణాలు, సొసైటీలలో ఎరువుల నిల్వలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రం నందు పొగాకు కొనుగోలు వివరాలు తెలుసుకున్నారు.

డిజిటల్ క్రాప్ సర్వే వేగవంతం చేయాలి

ఈ–పంట డిజిటల్ క్రాప్ సర్వే వేగవంతం చేయాలని, ఖరీఫ్ సీజన్‌లో ప్రస్తుతం సాగు చేసినటువంటి పంటలను ఈ–పంట నమోదు ద్వారా క్రాప్ నమోదు చేపట్టాలని డీఏఓ ఎం.జగ్గారావు అన్నారు. దీనికి సంబంధించి ఈ–క్రాప్ నిబంధనలో మార్పు జరిగిందన్నారు. గతంలో రూపొందించిన యూనిఫైడ్ డిజిటల్ ఫ్లాట్ ఫారం (యుడీపీ) యాప్‌ను రద్దుచేసి జాతీయ సమాచార కేంద్రం (ఎన్ఐసీ) ద్వారా ఈ– పంట డిజిటల్ క్రాప్ సర్వే పేరుతో కొత్త యాప్‌ను రూపొందించడం జరిగిందన్నారు. ఈ ఏడాది వరితో పాటు ఉద్యాన పంటలనూ నమోదు చేయాలన్నారు. ముందుగా వీఏఏలు, వీహెచ్ఏలు, ఎంపీఈఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయనతో పాటు సత్తెనపల్లి ఏడీఏ బోయపాటి రవిబాబు, ఏఓ బి.సుబ్బారెడ్డి, తదితరులు ఉన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగం మానవ మనుగడకు ప్రమాదకరం

జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు



డ్రగ్స్ వద్దు బ్రో ప్ల కార్డులను ప్రదర్శిస్తున్న జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ

నరసరావుపేట రూరల్: మాదక ద్రవ్యాల వినియోగం మానవ మనుగడకు ప్రమాదకరమని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. మాదక ద్రవ్యాల నిర్మూలన, శక్తి యాప్ వినియోగం, రోడ్డు భద్రత నియమాలుపై కళాశాలల ప్రతినిధులతో గురువారం అవగాహన కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ యువతలో డ్రగ్స్ వినియోగం వలన కలిగే హానికర ప్రభావాలపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. దీనిపై నిర్వహించే అవగాహన కార్యక్రమాల్లో విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావాలని కోరారు. కళాశాలలో విద్యార్థుల ప్రవర్తన, నడవడిక, చదువు తదితర అంశాలపై అధ్యాపకులపాటు తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రస్తుత సమాజంలో యువత చాలా తేలికగా మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతుందని, వీరిలో 15 నుంచి 30 సంవత్సరాల వయస్సు వారు ఎక్కువగా ఉంటున్నట్టు తెలిపారు. గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాలకు అలవాటు పడి మానసిక నియంత్రణ కోల్పోయి, వ్యసనాలను తీర్చుకునేందుకు నేర ప్రవృత్తి వైపు మళ్లి నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. మాదక ద్రవ్యాలను నివరించేందుకు జిల్లా వ్యాప్తంగా 370 ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేశామని, తమ పరిసరాల్లో గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగించినా, విక్రయించినా పోలీసులకు లేదా 1972 టోల్‌ఫ్రీ నెంబర్‌కు తెలియజేయాలని కోరారు. మహిళ భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం శక్తి యాప్‌ను తీసుకువచ్చినట్టు తెలిపారు. అత్యవసర సమయాల్లో మహిళలు శక్తి ఎస్ఓఎస్ యాప్‌ను వినియోగించుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఆగస్టు నెల మొత్తం ఎన్ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం కళాశాల ప్రతినిధులతో కలిసి డ్రగ్స్ వద్దు బ్రో ప్లేకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ జేవి సంతోష్, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ ఎం.వెంకటరమణ, జిల్లా డ్రగ్ కంట్రోల్ ఆఫీసర డి.సునీత, డీఏఈవో ఎం.నీలావతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బలహీనవర్గాలకు రక్షణ లేదు

వైఎస్సార్ సీపీ వడ్డెర విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు దేవళ్ల రేవతి



దాచేపల్లి: కూటమి ప్రభుత్వం అండ చూసుకొని ఆ పార్టీ నేతలు చేస్తున్న భౌతిక దాడులు ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేస్తున్నాయని, రాష్ట్రంలో లోకేష్ రెడ్ బుక్ పాలన అమలు చేస్తూ బలహీనవర్గాలను అణచివేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వడ్డెర విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ దేవళ్ల రేవతి అన్నారు. బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్‌పై జరిగిన దాడిని గురువారం ఆమె తీవ్రంగా ఖండించారు. జెడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి నేతలు నిలబెట్టిన అభ్యర్థి ఓడిపోతారని తెలిసే వైఎస్సార్ సీపీ అభ్యర్థి విజయాన్ని అడ్డుకునేందుకు ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడికి తెగబడ్డారని చెప్పారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలను జరగనివ్వకుండా కూటమినేతలు దాడులకు తెగబడుతూ ప్రతిపక్ష పార్టీలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆమె ధ్వజమెత్తారు. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ పై జరిగిన దాడిని తమ పార్టీ తీవ్రంగా పరిగణిస్తుందని, దీనిపై తమ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉద్యమం చేపడతామని వెల్లడించారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేక కూటమి ప్రభుత్వం చేతులెత్తేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల పై దాడులు చేస్తూ నీచమైన పాలన కొనసాగిస్తుందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో దాడులకు పాల్పడిన వారిపై జగన్ 2.0 లో చర్యలు తప్పక ఉంటాయని, కూటమి నేతల దాడులకు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు భయపడకుండా ధైర్యంగా ఎదురుకోవాలని, వచ్చేది మన ప్రభుత్వమేనన్నారు.

ఉంగరం మింగిన ఐదు నెలల చిన్నారి

గొంతులో అడ్డుపడిన ఉంగరాన్ని బయటకు తీసిన వైద్యులు



చిన్నారి సిద్రహాతో వైద్యుడు, సిబ్బంది



గొంతులో ఇరుక్కున్న వెండి ఉంగరం

నరసరావుపేట రూరల్: వెండి ఉంగరాన్ని మింగి ఐదు నెలల పాప తీవ్ర అస్వస్థతకు గురవడంతో వైద్యులు సకాలంలో స్పందించి ఉంగరాన్ని బయటకు తీయడంతో ప్రాణాపాయం తప్పింది. వివరాల్లోకి వెళితే.. ఫిరంగిపురం మండలం మునగపాడు గ్రామానికి చెందిన షేక్ సుభాని ఐదు నెలల కుమార్తె సిద్రహా చేతివేళ్లను నోటిలో పెట్టుకొని ఆడుకుంటున్న సమయంలో వేలికి ఉన్న వెండి ఉంగరం నోటిలోకి జారింది. కొంత సేపటికి చిన్నారి అస్వస్థతకు గురికావడంతో తల్లిదండ్రులు సిద్రహాను హుటాహుటిన నరసరావుపేట శంకుతల జనరల్ గ్రాస్ట్రో లివర్‌కేర్ ఆసుపత్రికి తరలించారు. గొంతులో అడ్డుపడిన ఉంగరాన్ని డాక్టర్ ఐలా శ్రీనివాస్, సిబ్బంది ఎండోస్కోపి విధానంలో బయటకు తీశారు. సకాలంలో స్పందించి ఆసుపత్రికి తీసుకురావడంతో చిన్నారికి ప్రాణాపాయం తప్పిందని వైద్యులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంలో భాగస్వామ్యం కావాలి



నరసరావుపేట రూరల్: ప్రకృతి వ్యవసాయ విధానంలో రైతులందరూ పంటలు సాగు చేసే విధంగా వ్యవసాయ, ఉద్యాన అధికారులు భాగస్వామ్యంతో పనిచేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా కార్యాలయంలో గ్రామ సహాయ సంచాలకుల మూడవ రోజు శిక్షణా కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో భాగమైన ప్రకృతి వ్యవసాయ శాఖకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక స్థానం కల్పించిందన్నారు. రైతుల ఖర్చు తగ్గి ఆదాయం పొందే విధంగా రసాయనాలు వీడి కషాయాలు వాడే పద్ధతుల్లో పంటలను సాగు చేయాలని తెలిపారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ విధానాల్లో పంటలు సాగుచేసే విధంగా రైతులకు వ్యవసాయ సిబ్బంది, గ్రామ సహాయ సంచకులు కృషిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓ శాంతి తదితరులు పాల్గొన్నారు.

వినుకొండలో సీపీఐ మహాసభలు ప్రారంభం

వినుకొండ: వినుకొండలో సీపీఐ పల్నాడు జిల్లా మహాసభలు గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా కార్యకర్తలు, నాయకులు తరలివచ్చారు. ఈ సభలకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావులతోపాటు పలువురు జిల్లా నాయకులు హాజరయ్యారు. నర్సరావుపేట నుంచి సీపీఐ నాయకులు, కార్యకర్తలు పౌరాణిక వేషధారణలో సభాస్థలికి వచ్చారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటరు నుంచి నిర్వహించిన ర్యాలీలో వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

నూరుశాతం అక్షరాస్యతే లక్ష్యం



శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న వయోజన విద్య ఉపసంచాలకులు అంజనేయులు, డ్వామా పీడీ

నరసరావుపేట రూరల్: రాష్ట్రంలో నూరుశాతం అక్షరాస్యత సాధించే లక్ష్యంతో ఉల్లాస్–అక్షర ఆంధ్ర వయోజన అక్షరాస్యత కార్యక్రమాన్ని చేపట్టినట్టు వయోజన విద్యాశాఖ ఉప సంచాలకులు కె.అంజనేయులు తెలిపారు. ఉల్లాస్ వయోజన అక్షరాస్యత కార్యక్రమం రెండవ దశ ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమంపై మండల స్థాయి కమిటి సభ్యులకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం మున్సిపల్ గెస్ట్ హౌస్‌లో గురువారం నిర్వహించారు. కార్యక్రమాన్ని అంజనేయులు ప్రారంభించి మాట్లాడారు. అక్షరాస్యతలో మన రాష్ట్రం దేశంలోని ఇతర చిన్న రాష్ట్రాల కన్నా వెనుకబడి ఉందన్నారు. 2029 నాటికి నూరు శాతం అక్షరాస్యత సాధించాలనే లక్ష్యంతో ఇతర ప్రభుత్వ శాఖల సహకారంతో పనిచేస్తున్నట్టు తెలిపారు. డీఆర్‌డీఏ, మెప్మాలలోని స్వయం సహాయక బృందాల మహిళలు, ఉపాధి హామీ కూలీలలో చదువురాని వారిని గుర్తించి వారికి చదువు చెప్పేందుకు పదమందికి ఒక వలంటీర్‌ను నియమిస్తున్నట్టు తెలిపారు. వలంటీర్లకు మండల స్థాయి కమిటీలు వారి మండలాల్లో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం టీచర్లు వారికి కేటాయించిన అభ్యాసకులకు క్రియాత్మక, ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యతను అందించవలసి ఉంటుందని వివరించారు. బాపట్ల జిల్లా నోడల్ ఆఫీసర్ జి.మల్లికార్జున్, డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి, రీసోర్స్ పర్సన్స్ కె.మనోరంజన్‌బాబు, రవి గోవర్ధన్, ఎంపీడీఓలు, ఎంఈఓలు, ఏపీఎంలు, ఏపీఓలు, మెప్మా సీఎంఎంలు పాల్గొన్నారు.

మాచర్ల-విజయవాడ ప్యాసింజర్ రైలు వేళల్లో మార్పు

మాచర్ల: మాచర్ల నుంచి విజయవాడ(67228) ప్యాసింజర్ రైలు వేళల్లో మార్పు చేసినట్లు రైల్వే శాఖ అధికారులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైలు మాచర్లలో ఉదయం 6 గంటలకు బయల్దేరి 8:30 గంటలకు గుంటూరు చేరుతుందని, 10:55 గంటలకు విజయవాడ చేరుకుంటుందన్నారు. తిరిగి విజయవాడలో సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి మాచర్ల రాత్రి 9.30 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.

భార్యను హతమార్చిన భర్త అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటరమణ, సీఐ విజయ్‌చరణ్, వెనుక నిందితుడు

నరసరావుపేటటౌన్: కుటుంబ వివాదాల నేపథ్యంలో భార్యను హతమార్చిన భర్తను అరెస్ట్ చేసినట్లు ఇన్‌చార్జి డీఎస్పీ వెంకటరమణ తెలిపారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. ఈనెల 2వ తేదీ రాత్రి కంభంపాలెంకు చెందిన మృతురాలు మేరీ కనిపించటంలేదని ఆమె తల్లి కోటమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో అదృశ్యం కేసు నమోదు చేశామన్నారు. విచారణలో భర్త జొన్నలగడ్డ రమేష్ ఆమెను ద్విచక్ర వాహనంపై తీసుకువెళ్లినట్లు సీసీ ఫుటేజ్ లభ్యమైందన్నారు. అతనిపై అనుమానంతో అదుపులోకి తీసుకొని విచారించగా, మేరీను అదే రోజు నకరికల్లు అటవీ ప్రాంతంలోకి తీసుకువెళ్లి హతమార్చినట్లు రమేష్ నేరాన్ని అంగీకరించాడన్నారు. అతను ఇచ్చిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకొని మేరీ మృతదేహాన్ని కనుగొన్నామన్నారు. సమావేశంలో సీఐ విజయ్ చరణ్, ఎస్ఐ అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

కిడ్నాప్ చేశామంటూ.. నగదు స్వాహా

ఫోన్‌లో వృద్ధ దంపతులను బెదిరించి రూ.50వేలు కొట్టేసిన ఆగంతకులు


చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): 'మీ అబ్బాయి ఇక్కడ అమ్మాయిని ఇబ్బంది పెడుతుంటే అదుపులోకి తీసుకున్నాం... మీ వాడ్ని చంపేస్తాం... మీ అబ్బాయి మీకు కావాలంటే అర్జెంట్‌గా మాకు రూ.50వేలు పంపండి... లేకుంటే మీ అబ్బాయి మీకు దక్కడంటూ' ఓ వ్యక్తి బెదిరింపు ఫోన్‌కాల్‌తో భయపెట్టి సొమ్ము కాజేసిన సంఘటన మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగింది. సంఘటనకు సంబంధించి బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం చాగంటివారిపాలెంకు చెందిన అనుమాలశెట్టి శ్రీనివాసరావు కుమారుడు వెంకట బాలసతీష్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. తండ్రి శ్రీనివాసరావు గ్రామంలోనే చిల్లర దుకాణం నిర్వహించుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం ఓ ఫోన్‌కాల్ రావటంతో శ్రీనివాసరావు బయటకు వెళ్లటంతో భార్య పద్మావతి ఫోన్‌లిఫ్ట్ చేసింది. ఫోన్‌లో అవతల వ్యక్తి హిందీ, ఇంగ్లిష్‌లో మాట్లాడుతూ మీ వాడ్ని కిడ్నాప్ చేశామని, అర్జంట్‌గా రూ.50వేలు ఫోన్‌పే చేయకపోతే చంపేస్తామంటూ ఏడుపులు, అరుపులు వినిపిస్తూ భయభ్రాంతులకు గురిచేసేలా మాట్లాడసాగాడు. ఆ సమయంలో వెంకట బాలసతీష్‌కు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయకపోవటంతో తీవ్ర ఆందోళనకు గురైన శ్రీనివాసరావు దంపతులు వారు పంపిన నెంబర్‌కు రూ.50వేలు ఫోన్‌పే చేశారు. కొద్దిసేపటి తర్వాత వెంకట బాలసతీష్ తల్లిదండ్రులకు ఫోన్ చేయటంతో మోసపోయామని గ్రహించారు. వెంటనే వారు ఫోన్ చేసిన నెంబర్‌కు ఫోన్ చేయగా వారు హిందీలో సంభాషించారని శ్రీనివాసరావు దంపతులు తెలిపారు. వెంటనే శ్రీనివాసరావు ముప్పాళ్ళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాల్ చేసిన నెంబర్‌కు పోలీసులు ఫోన్ చేయగా వారితోను అదే రీతిలో మాట్లాడుతూ ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారు. ఫోన్ పే చేసిన నెంబర్ ఆంధ్రప్రదేశ్‌కు చెందినదనే ప్రాథమికంగా గుర్తించారు. విషయాన్ని సైబర్‌క్రైమ్ దృష్టికి తీసుకెళ్లటంతో విచారణ చేపట్టినట్లు సమాచారం.

కళాశాలల్లో రెడ్ రిబ్బన్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలి

జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి డాక్టర్ మురళీకృష్ణ

నరసరావుపేట ఈస్ట్: జిల్లా పరిధిలో అన్ని యాజమాన్యాలలోని జూనియర్ కళాశాలల్లో రెడ్ రిబ్బన్ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ తెలిపారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు ఆరోగ్యశాఖలో భాగమైన ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్ఐవి, ఎయిడ్స్ (దిశ) ఆధ్వర్యంలో గురువారం హార్డ్ జూనియర్ కళాశాలలో జిల్లా స్థాయి రెడ్ రిబ్బన్ క్విజ్ నిర్వహించారు. డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ కళాశాలల్లో రెడ్ రిబ్బన్ క్లబ్‌లు ఏర్పాటు చేయటం ద్వారా విద్యార్థులలో ఎయిడ్స్ అవగాహన పెరిగి నియంత్రణకు అవకాశం కలుగుతుందని తెలిపారు. జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాశాఖాధికారి ఎం.నీలావతిదేవి మాట్లాడుతూ కళాశాలల్లో రెడ్ రిబ్బన్ క్లబ్‌లు ఏర్పాటుకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయని తెలిపారు. ఈమేరకు అన్ని ఇంటర్ కళాశాలల్లో క్లబ్‌ల ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో జిల్లా క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ జానీబాషా, హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ ప్రాజెక్ట్ మేనేజర్ ఉదయరాజు, సిఎస్సీ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మహమ్మద్‌గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోర్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఓగిరాల



నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ ఫ్లోర్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఓగిరాల వెంకట రాహుల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కే-రిడ్జి పాఠశాలలో గురువారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫ్లోర్ బాల్ పోటీలలో భాగంగా అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించి తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్టు ఈ సందర్భంగా వెంకటరాహుల్ తెలిపారు. రాష్ట్రంలో ఇప్పుడిప్పుడే గుర్తింపు పొందుతున్న ఫ్లోర్ బాల్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అసోసియేషన్‌ను మండల స్థాయి నుంచి ఏర్పాటు చేసి ఫ్లోర్ బాల్ పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. అసోసియేషన్ అభివృద్ధికి నిధులు సమకూర్చేందుకు కృషి చేస్తానని తన వంతుగా రూ.1.10 లక్షలు అందివ్వటం జరిగిందని తెలిపారు.

రణక్షేత్రంలో వీరాచారుల సందడి

కారెంపూడి: పల్నాటి వీరాచారులు పల్నాటి రణక్షేత్రం కారెంపూడిలో గురువారం తమ పూర్వీకులైన పల్నాటి వీరులకు పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ ఆధ్వర్యంలో ప్రత్యేక క్రతువులు నిర్వహించారు. గుంటూరులోని గుజ్జనగుండ్లకు చెందిన సింగంశెట్టి వెంకటే ష్ కుటుంబీకులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ఆచారవంతులు బస్సుల్లో తరలివచ్చారు. పల్నాటి వీరుల గుడి ఆవరణ నుంచి బ్రహ్మనాయుడు ఆయుధం నృసింహకుంతంతో పాటు పల్నాటి వీరుల ఆయుధాలకు వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. చెన్నకేశవస్వామి, అంకాలమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.